**112**

**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** రాజనగరి కళామందిరం. సామ్రాజ్యస్థాయి కళావేదిక కావడంతో.. సంస్కృత, తెలుగు భాషా సాహిత్యాలలో పుంభావ సరస్వతులైన కవిపండితులు ఎంతోమంది ఇక్కడికి వస్తుంటారు. ఎన్నో చర్చోపచర్చలు నిర్వహిస్తుంటారు. జాయచోడుడు అందరితోనూ ఆత్మీయంగా ఉంటాడు. కానీ, లలితాంబతోనే తనకు కాస్త ఇబ్బంది. రాసుకుంటూ.. పూసుకుంటూ తిరుగుతుంది. పిండి బంధాలపై, కరణులపై సందేహాలున్నట్లు అడుగుతుంది. మరో పండితుడు చెబితే నిరాసక్తంగా చూస్తుంది. జాయచోడుడు చెబుతుంటే.. కోటివెలుగుల కళ్లతో చూస్తుంది.

ఓ ఎనభై ఏళ్ల పండితుడు అడిగాడు చొంగ తుడుచుకుంటూ,

''లలితాంబా! నిత్యమూ ఇక్కడికి వస్తుంటే నీ వేశ్యాగృహ నిర్వహణ ఎలా..?''

''మామ ఎక్కడుంటే అదే నాగృహం. ఏం మామా..'' అన్నది గారంగా.

ఎంత గారంగా అన్నదంటే.. కొన్ని లిప్తల కాలం ఎవ్వడూ ఊపిరి పీల్చలేకపోయారు. ఓ కుర్రకవి కదిలి ఆ పెద్దాయనకు ఉత్తరీయం అందించాడు.

ఆయన 'ఇది ఎందుకు?' అన్నట్లు చూశాడు.

''చొంగ తుడుచుకోండి..'' అన్నాడు కుర్రకవి.

ముసలాయన కూడా తక్కువ తినలేదు.

''ముందు నీ చొంగ తుడుచుకో..'' అన్నాడు చిరాగ్గా.

లలితకు కవుల ప్రతిభ, వాళ్ల శృంగార కవిత్వం మాత్రమే కాదు.. వాళ్ల వెకిలి ప్రవర్తన కూడా క్షుణ్ణంగా తెలుసు. జాయచోడునికి ఇప్పుడు కాకతి కంటే మువ్వ ఎక్కువగా గుర్తొస్తున్నది. అది మధుర భక్తి.

లలిత శృంగార కీర్తనల ఉప్పెన. గతంలో లలిత పట్ల లలితలాలిత్య శృంగారయుత ఆలోచనలు, వివాహ బంధం.. అలాగే నీలాంబక్క చెప్పిన భోగినీ పండుగ కూడా అతనెప్పుడూ మర్చిపోలేదు.

ఈ మధ్యకాలంలో తను ఎన్నో జీవనకాలపు సంఘర్షణల్లో నలిగి నలిగి.. చిక్కి శల్యమయ్యాడు. లలితది కూడా పునర్జన్మే! ఇప్పుడామె అందరి కళ్లకు దోరగా ముగ్గిన మామిడిపండులా.. శృంగార రసాధిదేవతగా కనిపిస్తూ కనువిందు చేస్తున్నది. ఆమె తనపై కురిపిస్తున్న మధుర లేదా ముగ్ధ ప్రేమలో మొత్తంగా మొత్తం శృంగారమేనని అందరూ భావించవచ్చు. కానీ, అందులో తన కోసం ఆమె ఇన్నేళ్లుగా ఎదురుచూస్తున్న విరహప్రేమ, మధుర భక్తి లేవని తానెలా అనుకోగలడు?!

లలితపై జాయచోడునికీ ఇష్టాయిష్టాలున్నాయి. అందులో శృంగార ఉధృతి ఇప్పుడొచ్చిన సమస్య.

ఇప్పుడతనికి లలిత శారీరక సౌందర్యం కూడా రాత్రి పవళ్లు గుర్తొస్తున్నది. కవిగాళ్లు మరింత ఎగదోస్తున్నారు.

ఇంతకాలం జాయచోడుని అంతరంగంలో మరుగున పడిపోయిన శారీరక తృష్ణ ఏదో లోలోన సలుపుతున్నది.

గణపతిదేవుడు గుర్తొచ్చాడు.

ఆమెను ఆస్థాన నర్తకిగా నియమించడంలో ఆయన ఆంతర్యంలో మరేదో ఆలోచన ఉన్నట్లు జాయచోడుని సందేహం. ఆమె తనతో అతిగా ప్రవర్తించడం ఇక్కడ, ఇప్పుడు మాత్రమే కాదు.. ఆతుకూరు దేవాలయ ప్రారంభోత్సవం నాడుకూడా తనతో అతిగానే ప్రవర్తించింది. నృత్త ప్రదర్శనలో ఏ మార్గి నటి కూడా అలా ప్రవర్తించదు. లలితాంబకు తనపై ఆశ ఉన్నా ఆమె అతిగా ప్రవర్తించే తరహా ఆడపిల్ల కాదు. ఆమె పులి పిల్ల. స్త్రీ గౌరవాన్ని అవమానపరిస్తే సివంగిలా తలపడుతుంది. తల